ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: జవహర్‌నగర్‌లోని సమస్యలు పరిష్కరిస్తానని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం కాలనీలో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలపై ఆరా తీశారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, ఓపెన్ నాలాలు, యూజీడీ నిర్మాణ పనుల గురించి ఆయనను కోరారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని, వాటిని తొలగించాలని కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వారికి కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

మండల ట్రస్మా నూతన కార్యవర్గం



రామంతాపూర్ : రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాల యాజమాన్య సంఘం ట్రస్మా ఉప్పల్ మండలం కార్యవర్గాన్ని గురువారం రామంతాపూర్ గ్రామర్ స్కూల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి శ్రీధర్, కోశాధికారిగా కల్లూరి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ కబీర్, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌సాయి, కరుణాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డిలు ఎంపికయ్యారు. అనంతరం ఎన్నికైన కార్యవర్గాన్ని ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ రామ నర్సయ్య, సూరం రామ్‌రెడ్డి, సోమశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సత్కరించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



మల్లాపూర్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని చర్లపల్లి పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. మల్లాపూర్ అశోక్‌నగర్ కాలనీవాసులు బుధవారం ఇన్‌స్పెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసాంఘీక కార్యక్రమాలు జరగకుండా ముందస్తుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వారికి ఇన్‌స్పెక్టర్ సూచించారు. శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, నంపత్‌గౌడ్, రవికుమార్ తదితరులున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి


డీసీకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సర్కిల్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు, ఎస్ఎఫ్ఏలు, ఎలక్ట్రికల్ కార్మికులను భర్తీ చేయాలని, రెగ్యులర్ కార్మికులకు రావాల్సిన ఇంక్రిమెంట్స్, పెన్షన్, డీఈ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. సంఘం అధ్యక్షుడు రవిచంద్రన్, ప్రధాన కార్యదర్శి కె.రత్నం, జిల్లా అధ్యక్షుడు హరినాథరావు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాజు, శేఖర్, మహేందర్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై స్పెషల్ డ్రైవ్

మల్కాజిగిరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బలరాంనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంట్లో నీటి నిల్వలు, పూలకుండీలు, పాత సామన్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంటమాలజీ విభాగం వారిచేత దోమలు వృద్ధి చెందకుండా లార్విసైడ్ మందును పిచికారి చేయించారు. స్వచ్ఛ భారత్ సాధ్యం కావాలంటే ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రజలు కూడా సహకరించాలన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు గిరి, బాలామణి, ఎంటమాలజిస్ట్ వనజ కాలనీవాసులు పాల్గొన్నారు.

రూ. 13 లక్షల ప్రజాధనం వృథా !

- చిరు వ్యాపారుల కోసం 6 చోట్ల షెడ్ల నిర్మాణం
- ఐదేళ్లు గడిచినా ప్రారంభానికి నోచుకోని వైనం
- అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం, ట్రాఫిక్ సమస్యలు పరిష్కారానికై చిరువ్యాపారుల (స్ట్రీట్‌వెండర్స్) కోసం అధికారులు, గత పాలకవర్గం పలుచోట్ల ప్రధాన రోడ్లలో వ్యాపార సముదాయాలు దుకాణాల కోసం సుమారు కోటి రూపాయలతో పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో 6 చోట్ల షెడ్ల నిర్మాణాలు చేపట్టి ఐదేళ్లు గడిచినా చిరువ్యాపారులకు కేటాయించకపోవడం అధికారులు, అప్పటి పాలకవర్గం నిర్లక్ష్యంతో నీరుగారింది.

☛ పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని కాలనీల్లో రోడ్లపై వారాంతపు సంతలను నిర్వహించడంతో ఆయా కాలనీల్లో ట్రాఫిక్‌జామ్ సమస్యలు తలెత్తడం, వాహనదారులు, పాదచారులు, అత్యవసర వాహనాల రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. మార్కెట్లు ముగిసిన తర్వాత రోడ్లపై చెత్త, కూరగాయల వ్యర్థాలతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీంతో చిరువ్యాపారులు, ప్రజలను దృష్టిలో ఉంచుకుని (స్ట్రీట్ వెండర్స్) ఏర్పాటుకు అప్పటి పాలకవర్గం నిర్ణయంతో అధికారులు ముందుకొచ్చి పీర్జాదిగూడ నగర పరిధిలో 6 చోట్ల దుకాణాల సముదాయాలను నిర్మించి చిరువ్యాపారులకు అందించేలా ప్రణాళికలు రూపొందించారు.


బుద్ధానగర్‌లో దుకాణాల సముదాయం


పూర్తయిన షెడ్ల నిర్మాణం, నిరుపయోగంగా ఇలా..

ప్రాంతాల వారీగా నిధుల కేటాయింపు..

బుద్ధానగర్‌లో రూ.17.85 లక్షలు, 15 స్టాల్స్, గ్రీన్ లాండ్స్ కాలనీలో రూ.15 లక్షలతో 10 స్టాల్స్, పీర్జాదిగూడ నగరపాలక సంస్థ ప్రభుత్వ పాఠశాల వద్ద రూ.25లక్షలతో 16 స్టాల్స్, బుద్ధానగర్ యస్టీఓ ఆఫీస్ వద్ద రూ.30 లక్షలతో 56 స్టాల్స్, మసీదు రోడ్డులో రూ.10 లక్షలతో 3 స్టాల్స్, పర్వతాపురం (అరోరా కాలేజ్) పక్కన రూ.15 లక్షలతో 13 స్టాళ్లను నిర్మించారు. ఈ స్టాల్స్‌ను నిర్మించి ఐదేళ్లు గడిచినా ఇప్పటికీ నిరుపయోగంగానే ఉన్నాయి.

☛ చిరువ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు రాత్రి సమయాల్లో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని ఉపయోగంలోకి తీసుకురావాలని నగర ప్రజలు కోరుతున్నారు.

అర్హులకు షెడ్లు కేటాయించాలి..



నిరుపయోగంగా ఉన్న స్టాల్స్‌ను గుర్తించి సంబంధిత అధికారులు ఇప్పటికైనా అర్హులైన వీధి వ్యాపారులను గుర్తించి కేటాయించాలి. స్టాల్స్ ఎదురుగా పార్కింగ్‌లకు అడ్డాలుగా, పోకిరీల కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి.

– అనిల్‌రెడ్డి, పీర్జాదిగూడ నగర బీజేపీ నేత

అక్రమ నిర్మాణాల తొలగింపు

- మంత్రి సీతక్క చొరవతో కదిలిన యంత్రాంగం
- నాలా బఫర్‌జోన్లపై ఇరిగేషన్ అధికారుల సర్వే

కుషాయిగూడ: చర్లపల్లి ఇందిరాగృహకల్ప కాలనీలోని కబ్జాలపై కాప్రా రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. చర్లపల్లి కబ్జాలపై స్థానిక కాంగ్రెస్ నాయకుడు ప్రేమ్‌కుమార్ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. దీంతో రెవెన్యూ, ఇరిగేషన్ యంత్రాంగం గురువారం ఇరిగేషన్ ఏఈ సుధీర్, కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్, సర్వేయర్ మహేందర్ ఇందిరా గృహకల్ప కాలనీని సందర్శించారు. అక్రమ నిర్మాణాలను పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలతో నేలమట్టం చేశారు. సెప్టిక్‌ట్యాంకుల స్థలంలో ఏర్పాటు చేసిన ప్రీకాస్ట్ ప్రహరీని తొలగించారు. సదరు స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

◆ నేతాజీనగర్‌లో నాలా పరివాహక ప్రాంతం బఫర్‌జోన్‌లో నిర్మించిన నిర్మాణాలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేశారు. త్వరలోనే ఆ నిర్మాణాలను కూడా తొలగిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు.


చర్లపల్లి ఇందిరా గృహకల్పలో ప్రీకాస్ట్‌ను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు


వివరాలు సేకరిస్తున్న అధికారులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

రామంతాపూర్ : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో వెంకటరెడ్డినగర్‌లోని సత్యసాయి విద్యాసంస్థలు నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాలను మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్, కార్పొరేటర్ చేతనాహరీష్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ పొంది రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. యశ్వంత్, సుధాకర్, రాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


వర్ష

మల్కాజిగిరి: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ యువతి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. వీణాపాణినగర్‌కు చెందిన గొల్లపల్లి ఆశిష్‌కుమార్ రైల్వే ఉద్యోగి. అతడి సోదరి గొల్లపల్లి వర్ష (35) మానసిక స్థితి గత కొంతకాలంగా సరిగ్గా లేదు. దీంతో ఈనెల 5న ఇంటి దగ్గరలోని గుడికి వెళ్లి తిరిగి రాలేదు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఏర్పాటుకు చర్యలు


కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

మల్కాజిగిరి: మల్కాజిగిరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆశావర్కర్లు కార్పొరేటర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మల్కాజిగిరిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలంలోనే జిల్లా కేంద్ర ఆసుపత్రిని నిర్మించారన్నారు. తాత్కాలికంగా నెరేడ్‌మెట్‌కు తరలించినా.. అప్పటి నుంచి తిరిగి మల్కాజిగిరి ప్రాంతంలో ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోలేదన్నారు. దీనివల్ల ప్రజలకే కాకుండా ఆశావర్కర్లు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాని హామీ ఇచ్చారు. హేమలత, జయశ్రీ, వసంత తదితరులున్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో కొనసాగుతున్న ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులను గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. గౌతంనగర్ డివిజన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. నాయకులు మేకల రాముయాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో విద్యార్థులకు శిక్షణ పూర్తి

అల్వాల్: ఓయూ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంపార్టింగ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఫర్ అండర్ గ్రాడ్యుయేట్ ట్రైబల్ స్టూడెంట్స్ ఫర్ తెలంగాణ' కార్యక్రమానికి మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు వాణి, శిరీషలు హాజరై శిక్షణ పూర్తి చేసుకున్నారు. గురువారం శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాలోని డిగ్రీ కళాశాల గిరిజన విద్యార్థుల కోసం తొలిసారి నిర్వహించిన ఈ కార్యక్రమానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి కేవలం మల్కాజిగిరి డిగ్రీ కళాశాల విద్యార్థులు మాత్రమే ఎంపికై, విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్నారన్నారు. ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తాయని, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ బ్రిజేష్, వైస్ ప్రిన్సిపాల్ అడవిరాజు, హరిత, అధ్యాపకులు రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆదర్శనగర్ పార్కులో వ్యర్థాలు తొలగించండి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ ఆదర్శనగర్ కాలనీలోని పార్కు నిరుపయోగంగా మారింది. నిర్వహణ లేకపోవడంతో పార్కు స్థలం చెత్త,చెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ క్రమంలో విషసర్పాలు తిరుగుతూ.. ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సీసీఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, కాలనీవాసులు నరసింహ వంశరాజ్, ముత్తు వంశరాజ్, గంప కృష్ణ, రవి, నరసింహారెడ్డి, ఉపేందర్, సింగిరెడ్డి నరసింహ్మారెడ్డి, రాము, చిట్టిబాబు, గిరి తదితరులు పాల్గొన్నారు.


పార్కులోని మట్టికుప్పల వద్ద ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

అభివృద్ధి పనుల పరిశీలన

మల్లాపూర్: నాచారం భవానీనగర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్ద రూ.94 లక్షలతో నిర్మిస్తున్న నాలా వంతెన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అధికారులకు సూచించారు. గురువారం వంతెన పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా 10 మీటర్ల విశాలమైన వంతెనను నిర్మించనున్నట్లు వివరించారు. ఇంజినీరింగ్ అధికారులు ఈఈ నాగేందర్, డీఈ బాలకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, కట్ట బుచ్చన్నగౌడ్, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్‌రావు, అశోక్, హరిప్రసాద్ తదితరులున్నారు.

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని తిరుమలనగర్, ప్రశాంతి ఎన్‌క్లేవ్‌లో జరుగుతున్న సీసీరోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ సూచించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రావు, బీఆర్ఎస్ నేతలు మోసిన్, ప్రభాకర్, విజయ్‌శేఖర్, ఈశ్వర్‌గౌడ్, వీరేష్, జాందర్, సదానంద్, రాజునాయక్, తాజ్ తదితరులు పాల్గొన్నారు.


నాలా వంతెనను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి


సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిత

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవి మైవిల్లాస్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీఎస్ ఫుడ్స్‌కాలనీ, కాకతీయ కాలనీ, ఓల్డ్ విలేజ్, యాదయ్యనగర్, జయశ్రీ కాలనీ, కమలానగర్, అరవిందఎన్‌క్లేవ్, రామకృష్ణనగర్, అక్షయ ఎన్‌క్లేవ్, మైవిల్లాస్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11కేవీ బుద్ధానగర్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్, వరంగల్ హైవేలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ బెల్ సబ్‌స్టేషన్ పరిధిలోని భవానీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భవానీనగర్, కేఎల్‌రెడ్డినగర్, హెచ్‌సీఎల్‌నగర్, మల్లాపూర్ విలేజ్, ఎస్వీనగర్, మై ఫ్లవర్ పార్క్, మల్లాపూర్ మజీద్, పఠాన్ బస్తీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.

11 కేవీ నర్సింహానగర్ ఫీడర్ పరిధిలో...
నర్సింహానగర్, శివహోటల్, ఏపీ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, శాంతినగర్, మీర్‌పేట్, సాయిగార్డెన్స్ ఏరియా మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు తెలిపారు. 11 కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు మై ఫ్లవర్ హైట్స్, లక్ష్మీనరసింహనగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలో 12 గంటల నుంచి 12.30 వరకు జనప్రియ టౌన్‌షిప్, సాయిటవర్స్, మోదీ టవర్స్, ఏపీ కాలనీ, లింగమయ్యనగర్ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రకటించారు.

ఉప్పల్: హబ్సిగూడ గ్రీన్‌హిల్స్ కాలనీ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు వీధి నెంబర్– 8 వసంతవిహార్ కాలనీ వీధి నెంబర్ 1 నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

◆ 11కేవీ గ్రీన్‌హిల్స్ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా వీధి నెంబర్–8లో గ్రీన్‌హిల్స్ కాలనీ, వీవీనగర్, స్నేహనగర్, లేన్ నంబర్ 13 నుంచి 14 వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ తెలిపారు.

◆ వీధి నంబర్ –8 33/11 కేవి ఫీడర్ మరమ్మతుల కారణంగా సాయంత్రం 4 గంటల నుంచి 4.30 వరకు వీవీనగర్, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి కాలనీని ఉద్యానవనంగా చేస్తాం

ఉప్పల్: ప్రతి కాలనీలో ఒక ఉద్యానవనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ఉద్యానవనాలను ఎల్‌బీనగర్ జోన్ హార్టికల్చరల్ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణతో కలిసి పరిశీలించారు. పార్కులను సుందరీకరించాలని, అవసరమైన చోట్ల బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు చిల్డ్రన్స్ పార్కులను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై అధికారి అన్నపూర్ణ హామీ ఇచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, శ్యామ్, బాలాజీఎన్‌క్లేవ్ సలహాదారుడు వేణుగోపాల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిలుకానగర్ డివిజన్‌లో పార్కులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత తదితరులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఉప్పల్ : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మద్దతుగా అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంపై గురువారం ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 30 ఏళ్ల మాదిగల ఆకాంక్ష, వారి కలను సాకారం చేస్తూ.. చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని తీసుకుని ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి అమోదింపజేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి, ఆగిరెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, అరుణ్, అమరేశ్వరి, రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేముల కేశవనాథంగౌడ్ ఆధ్వర్యంలో గురువారం సిరిస్కూల్‌లో కంటిపరీక్షల వైద్య శిబిరాన్ని డాక్టర్ అమర్నాథ్ ఐ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన లయన్ చందనకు కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ శారద, దుర్గ, పల్లె బాలరాజ్‌గౌడ్, అరుణ, శ్రీలత, నిర్మల, వెంకటేష్‌గౌడ్, రంగన్నగౌడ్, సురేందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, దేవి, రాజేశ్వరి, ఆసుపత్రి సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.


కంటి వైద్య శిబిరంలో సిబ్బందితో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఎస్సీ వర్గీకరణతో అందరికీ సమన్యాయం

మౌలాలి : కేవలం సామాజిక సమానత్వం కోసం వర్గీకరణ ప్రజాస్వామ్యంలో అందరికీ సమన్యాయం జరగాలనే ఉద్దేశంతో నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపారు. 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ పోరాటానికి మద్దతు తెలపడం అభినందనీయమని మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్ యాదవ్ పేర్కొన్నారు. అనంతరం ఆమె పార్టీ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో వర్గీకరణకు మద్దతుగా సమావేశం నిర్వహించారు. నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, శివగౌడ్, నవీన్, కరుణశ్రీ, శ్రీనివాస్‌యాదవ్, రాధా, అనీల్, నటరాజ్, అలివేలు, సుజాత తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ సునీతతో స్థానిక నేతలు

10న ఐటీఐలో జాబ్‌మేళా

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హనుమాన్‌నాయక్ తెలిపారు. పీఎంఎస్ఎంఎం పథకం ద్వారా మేళా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేళాలో మహీంద్ర, సచెందర్, ఇంజిన్‌వాల్స్, ఫెనెస్టా, మెఘా ఇంజినీరింగ్, రాక్వెల్ వంటి కంపెనీలు పాల్గొననున్నాయి. అన్ని కంపెనీల్లో అప్రంటెసిస్ కోసం 800 పోస్టులు ఖాళీ ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు.